క్లుప్తంగా

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



పెనుగంచిప్రోలు: విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులతో కథలు చదివించటం, నీతి వాక్యాలు చెప్పించటంతో పాటు కార్టూన్లు, గ్రంథ పఠనం వలన కలిగే లాభాలను వివరించారు. నీతి కథల పుస్తకాలు చదవటం, వినటం వలన నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. అనంతరం పలు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



పెంట్యాలవారి గూడెం(వత్సవాయి): పిడుగుపాటుకు ఎద్దు మృతిచెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల మేరకు గ్రామానికి చెందిన వడ్డే వెంకటేశ్వరరావు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అర్ధరాత్రి ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం పడింది. ఆ సమయంలో వెంకటేశ్వరరావు ఇంటి సమీపంలో పిడుగు పడడంతో ఎద్దు మృతిచెందింది. సుమారు రూ.70 వేల వరకు నష్టం జరిగిందని రైతు తెలిపారు.

పెద్దాపురం మాజీ సర్పంచి లక్ష్మయ్య మృతి



వీరులపాడు(కంచికచర్ల): వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామ మాజీ సర్పంచి నిప్పులపల్లి లక్ష్మయ్య(80) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవల రమేష్‌బాబుతో పాటు సత్యనారాయణ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి లక్ష్మయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ లక్ష్మయ్య కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మయ్య 2001 నుంచి 2006 వరకు సర్పంచిగా పనిచేశారు. ఆయన హయాంలో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం చేసేవారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అన్నారు.

మహిళ మెడలో నానుతాడు అపహరణ

కంచికచర్ల: గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలో నానుతాడు లాక్కొని వెళ్లిన సంఘటన కంచికచర్లలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు స్థానిక వసంతకాలనీకి చెందిన కొట్టు సీత అదే కాలనీలో వేరొక ఇంటిలో నివాసముంటున్న తన కుమార్తె ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు కాసుల బంగారు నానుతాడును లాక్కొని వెళ్లారు. ఈ ఘటనలో ఆమె కిందపడిపోయింది. చుట్టుపక్కల వారు వచ్చేలోగా దుండగులు బంగారు నానుతాడుతో పరారయ్యారు. నానుతాడు విలువ రూ.69వేలు ఉంటుందని మహిళ తెలియజేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెనుగంచిప్రోలు: రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం నుంచి సబ్సిడీపై మంజూరైన జీలుగు విత్తనాలను మంగళవారం ఆమె రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్బీకేల ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను అందిస్తూ వారికి అండగా నిలుస్తోందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

- మండలంలో 8 అంగన్‌వాడీలకు నూతన భవనాలు
- కమిటీల పర్యవేక్షణలో మౌలిక వసతుల కల్పన



ముచ్చింతాలలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనం

పెనుగంచిప్రోలు: అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. అంగన్‌వాడీ స్కూళ్లను ప్రీ స్కూళ్లుగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వం వాటి రూపురేఖలను మార్చేందుకు నాడు–నేడు పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం కింద ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలతో పాటు సకల హంగులను సమకూర్చనుంది. మండలంలో మొత్తం 54 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 8 అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవనాల నిర్మాణానికి నాడు–నేడు కార్యక్రమం కింద నిధులు మంజూరై పనులు జరుగుతున్నాయి.

వీటితో పాటు అనిగండ్లపాడులో, లింగగూడెంలో ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు, ప్లే సామగ్రి కోసం రూ.5 లక్షలు కేటాయించారు.

కమిటీల ద్వారా పనుల పర్యవేక్షణ...

నాడు–నేడు పనులు పారదర్శకంగా నిర్వహించేందుకు కమిటీలను ఏర్పాటు చేశారు. భవన నిర్మాణాలకు సంబంధించి 9 మంది కమిటీ సభ్యుల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కన్వీనర్ కాగా, సభ్యులుగా అంగన్‌వాడీ వర్కర్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళా సంరక్షణ కార్యదర్శి, ప్రీ స్కూల్ చిన్నారుల తల్లులు ఐదుగురు ఉంటారు. వీరి పర్యవేక్షణలో నాడు–నేడు పనులు చేపట్టారు. పాఠశాలల్లో మొదటి దశ పనులు పూర్తయి, రెండో దశ పనులు కూడా జరుగుతున్నాయి.

మండలంలో నిధులు మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాలు

అంగన్‌వాడీ కేంద్రం	మంజూరైన నిధులు(లక్షల్లో)
పెనుగంచిప్రోలు-2	రూ.20.34
పెనుగంచిప్రోలు-3	రూ.21.98
పెనుగంచిప్రోలు-10	రూ.18.97
ముచ్చింతాల-3	రూ.20.73
అనిగండ్లపాడు-1	రూ.22.34
అనిగండ్లపాడు-5	రూ.22.71
గుమ్మడిదూర్రు-2	రూ.22.34
వెల్లుర్తిపాడు	రూ.22.35

8 అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపిక



మండలంలో చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 54 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా నాడు–నేడు పథకం కింద 8 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం ఇవి వివిధ దశల్లో ఉన్నాయి. పనులను కమిటీల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహిస్తున్నాం.

–ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

సంక్షేమాల విప్లవంతో దేశంలోనే సంచలనం

- అపూర్వ ఘట్టానికి నాలుగేళ్లు పూర్తి
- ప్రభుత్వ విప్ ఉదయభాను



జగ్గయ్యపేటఅర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన చరిత్రను సృష్టిస్తూ ముందుకు సాగుతోందని, భారతదేశ చరిత్రలో గతంలో ఎవరూ, ఎన్నడూ అమలు చేయని సంక్షేమ పథకాల విప్లవంతో సంచలనం కలిగిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. నయవంచక పాలనకు చరమగీతం పాడి సంక్షేమ పాలనకు శ్రీకారం చుడుతూ వైఎస్సార్ సీపీ విజయం సాధించిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే ఉదయభాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2011 మార్చి 12 న ఆవిర్భవించి కేవలం ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీతో ప్రస్థానం ప్రారంభించి అనతి కాలంలోనే ప్రజాభిమానం పొంది 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీలతో లోక్‌సభలోనే నాలుగవ అతిపెద్ద పార్టీగా అవతరించడం మామూలు విషయం కాదన్నారు. జగన్ పోరాట పటిమ, పాదయాత్ర, నవరత్నాల పథకాలతో ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. 650 హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయని 40 ఏళ్ల సీనియర్ చంద్రబాబును అపహాస్యం చేసేలా వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 80 శాతం హామీలు అమలు చేసి తన సత్తా చాటుకున్నారన్నారు. నాలుగు లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు, వలంటీర్ల వ్యవస్థ, సచివాలయాల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం, రైతుభరోసా, అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, గోరుముద్ద, నాడు–నేడు, సున్నా వడ్డీ తదితర విలక్షణమైన పథకాలతో సాగుతున్న ఏపీ వైపునకు యావద్భారత దేశం చూసేలా చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు జేజేలు పలుకుతున్నారని తెలిపారు. దేశంలోనే మేటి రాష్ట్రంగా ఏపీని అగ్రస్థానంలో నిలిపేందుకు జగన్‌మోహన్‌రెడ్డిని మరొకసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారన్నారు.

వాటర్ ట్యాంకులన్నీ శుభ్రంగా ఉంచాలి

మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు



ఆనందసాయి ఆలయం వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ ఆవరణను పరిశీలిస్తున్న పేట మున్సిపల్ కమిషనర్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని అన్ని వాటర్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న కుళాయిల్లో వచ్చే తాగునీరు దుర్వాసన వస్తోందని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని ఆనందసాయి ఆలయం వద్ద ఉన్న ఈఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాటర్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచకపోతే తాగునీరు కలుషితం అవుతుందని, ఫలితంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



జగ్గయ్యపేట గ్రంథాలయంలో విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై శిక్షణ ఇస్తున్న విద్యార్థి నర్మద

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు వివిధ అంశాల గురించి శిక్షణ ఇస్తున్నారు. శిబిరంలో మంగళవారం విద్యార్థులతో పుస్తకాలు చదివించి కథలు చెప్పించారు. అనంతర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే పీజీ విద్యార్థిని నర్మద విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. యోగా టీచర్ లీలావతి యోగాసనాలను నేర్పించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, సత్యావతి, పాఠకులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఖాళీ స్థలాల్లో కంపచెట్లు తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేటఅర్బన్: జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను ఆయా స్థలాల యజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. స్థానిక ఆరవ వార్డు పరిధిలో రావూస్ స్కూల్ వెనుక గృహాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి ఉండటంతో మరుగుగా ఉన్న ఆ స్థలాలలో విష సర్పాలు, క్రిమి కీటకాలు సంచరిస్తున్నాయని స్థానికులు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కంపచెట్ల తొలగింపు పనులను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారికి నోటీసులు పంపిస్తామని చెప్పారు. వారి స్థలాలను వారే బాగుచేసుకొని ఫెన్సింగ్ వేసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పెనుగంచిప్రోలు సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మూడవ సచివాలయం కన్వీనర్ కాకర్ల లక్ష్మీనారాయణ, శానిటరీ మేస్త్రి నాగరాజు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్టేషన్ సీఐ పి.శ్రీనుకు వచ్చిన సమాచారం మేరకు గుంటుపల్లి రామకృష్ణ నగర్‌లో జరుగుతున్న పేకాట శిబిరంపై తన సిబ్బందితో మంగళవారం రాత్రి దాడి చేశారు. తొమ్మిదిమంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.45వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పి.శ్రీను తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా



గండేపల్లి(కంచికచర్ల): ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌ల సహకారంతో కృషిచేస్తున్నామని గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్ అన్నారు. మండలంలోని గండేపల్లిలో రెండు రోజుల క్రితం భారీగా కురిసిన వర్షానికి విద్యుత్ తీగెలు తెగిపోవటంతో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. అయితే ఈ పనులు ఆలస్యం కావటంతో మంగళవారం సర్పంచ్ సొంత నిధులు వెచ్చించి ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకున్నారు. సర్పంచి మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఈ ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవటంతో విద్యుత్ తీగెలు తెగిపోయాయని, రక్షిత మంచి నీటి సరఫరా విద్యుత్ మోటార్లకు విద్యుత్ సక్రమంగా సరఫరా కావటం లేదన్నారు. దీంతో ప్రజలు వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు పడకుండా సొంత నిధులు వెచ్చించి ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అన్ని కాలనీలలో మంచినీరు సరఫరా అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, ఉప సర్పంచి బి. సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



నందిగామ: వేసవి నేపథ్యంలో సైతం పట్టణవాసులకు మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 7 వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను, స్థానిక బోరు పంపులలోని నీటి నాణ్యతను పరిశీలించారు. వార్డు ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టామని, అన్ని ప్రాంతాలకు తాగునీరందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వైస్ చైర్‌పర్సన్ మాడుగుల నాగరత్నం, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రంలో బాదంపాలు పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో మంగళవారం బాదంపాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి మాట్లాడుతూ సంఘ సభ్యుడు తుమ్మా మహేష్ సహకారంతో సుమారు 3 వేల మందికి బాదం పాలు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



వి.అన్నవరం గ్రామంలో మహిళ చెబుతున్న సమస్యలను వింటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు(కంచికచర్ల): కులం, మతం పార్టీలు చూడకుండా అర్హత గల ప్రతి ఒక్కరికీ ఇళ్లు, ఇళ్లస్థలం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. వీరులపాడు మండలం వి.అన్నవరం గ్రామంలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరారు. త్వరలోనే జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలోని ప్రజలందరికీ తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షహనాజ్ బేగం, సర్పంచి జె.వరబాబు, ఎంపీటీసీ సభ్యులు తోట నారాయణరావు, జె.శేషగిరిరావు, రాంబాబు గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేతో రైతులకు మేలు



పెద్దాపురంలో భూముల రీ సర్వే రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్

వీరులపాడు(కంచికచర్ల): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూములను రీ సర్వే చేస్తోందని, రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. వీరులపాడు మండలం పెద్దాపురం, జయంతి గ్రామాల్లో ప్రభుత్వ, ప్రయివేటు భూములను మంగళవారం రీ సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రీ సర్వే వల్ల భూముల్లో కచ్చితమైన కొలతలు, హద్దులు వస్తాయని అన్నారు. 100 ఏళ్ల నాటి భూములను ప్రభుత్వం రీ సర్వే చేపట్టటంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు మేలు జరుగుతుందన్నారు. గ్రామంలో గత పదిహేను రోజుల నుంచి రెవెన్యూ సిబ్బంది భూములను రీసర్వే పనులు చేపట్టిందన్నారు. గ్రామాల్లో ఎనిమిది బృందాలుగా విడిపోయి 45 మంది గ్రామ సచివాలయ, మండల సర్వేయర్లతో ప్రభుత్వ, ప్రయివేటు భూములను రీ సర్వే చేస్తున్నామన్నారు. గ్రామ సరిహద్దును కూడా రీఫిక్స్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ సూర్యారావు, తహసీల్దార్ ఆశియానాయక్, ఆర్‌ఐ, వీఆర్వో, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఏసీబీ దాడులతో ఉలికిపాటు

- వణికిపోతున్న అవినీతి అధికారులు, ఉద్యోగులు
- డివిజన్ వ్యాప్తంగా చర్చోపచర్చలు



చిల్లకల్లు ఎస్‌ఐ ఇంట్లో జరుగుతున్న ఏసీబీ సోదాలు (ఫైల్)

నందిగామ: ఏసీబీ దాడులు అవినీతి అధికారుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. గతంలో డివిజన్ పరిధిలో పలు తహసీల్దార్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా ఒక పోలీస్ అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. దీంతో డివిజన్ పరిధిలోని పలు శాఖల్లో ఉన్న అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అవినీతి రహిత సమాజాన్ని నెలకొల్పాలని ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తోంది. అయితే పలు శాఖల అధికారులు అవినీతికి పాల్పడుతూ ఆ శాఖలకే మచ్చ తెచ్చే విధంగా చేస్తున్నారు. ఇదే తరహాలో నందిగామ డివిజన్ పరిధిలోని చిల్లకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఓ కేసు విషయంలో అధిక మొత్తంలో లంచానికి ఆశ పడ్డారు. ఈ తరుణంలో బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులకు సోమవారం రాత్రి ఆ ఎస్‌ఐ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు.

ప్రజల అవసరాలను ఆధారం చేసుకుని...

ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అవినీతి అధికారులు పెద్ద మొత్తంలో లంచాలు డిమాండ్ చేస్తూ కాసులు కూడగట్టుకుంటున్నారు. కొన్ని శాఖల్లో కొందరు అధికారులైతే ఒక్కో పనికి ఒక్కో ధర నిర్ధారించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. వీళ్ల పరిస్థితి దొరికితే దొంగ... లేదంటే దొర అన్న చందంగా మారిపోయింది. కంచే చేను మేస్తే అన్న చందంగా...బాధితులకు అండగా నిలవవలసిన ఒక పోలీస్ అధికారి అవినీతికి పాల్పడి ఏసీబీ అధికారులకు దొరికిపోవడంతో ఈ విషయం మరింత చర్చనీయాంశంగా మారింది. ఏదిఏమైనా ఏసీబీ దాడులు అవినీతి అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

● ఎండమావులు



ఉదయం 7 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. మంగళవారం ఉదయం ఎండ తీవ్రతకు రాజధానికి వెళ్లే సీడ్ యాక్సిస్ రోడ్డులో కనిపించిన ఎండమావులను సాక్షి కెమెరా 'క్లిక్'మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

దివ్యాంగ విద్యార్థులకు పోటీలు

కంచికచర్ల: వేసవి కాలంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రభుత్వం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయ గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ ముందుగా తెలుగు భాషా పరిజ్ఞానం గురించి వివరించారు. దివ్యాంగ విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు విద్యార్థులకు కథలతో పాటు నృత్యాలు నేర్పించారు. నీలం సర్వేశ్వరరావు విద్యార్థులకు చిత్రలేఖనం నేర్పించారు.